# రెండేళ్ళ తెలంగాణా వ్యవసాయ రంగం: సవాళ్ళు పరిష్కారాలు

జి. వి. రామాంజనేయులు, రవి కన్నెగంటి

కొన్ని వాస్తవాలు :

1. తెలంగాణా జిల్లాలలో గత ఇరవై సంవత్సరాలలో 27,347 రైతులు ఆత్మహత్య చేసుకున్నారని జాతీయ నేర గణాంకాల విభాగం నివేదికలు తెలియచేస్తున్నాయి. ఈ కాలం లో మూడు పార్టీలు అధికారం లో వున్నాయి, ఐదుగురు ముఖ్యమంత్రులు మారారు. అయినా రైతుల దుస్థితి మారలేదు.




2. రాష్ట్రం లో 2011 జనాభా గణాంకాల ప్రకారం 68.69 శాతం కుటుంబాలు గ్రామీణ ప్రాంతం లో నివసిస్తుంటే, 31 .31 శాతం కుటుంబాలు పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్నాయి. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ విశ్లేషణ - 2014 ప్రకారం 40 శాతం కుటుంబాలు వ్యవసాయం ప్రధాన వృత్తిగా, మరో 12.5 శాతం కుటుంబాలు వ్యవసాయ కూలీ ప్రధాన వృత్తిగా జీవిస్తున్నాయి. మరో 26.5 శాతం కుటుంబాలకు స్వయం ఉపాధి ప్రధాన వృత్తి .
3. 2011 సామాజిక, ఆర్ధిక, కుల గణన గణాంకాల ప్రకారం తెలంగాణా రాష్ట్రం లో (గ్రామీణ ప్రాంతంలో) మొత్తం కుటుంబాలు 57,06,101. భూమి కలిగిన కుటుంబాలు 24,17,061(42%), భూమి లేని కుటుంబాలు 32,88,938(58%). సాగుదారుల కుటుంబాలు 14,94,378 (26.19 %) వ్యవసాయ కూలీల కుటుంబాలు – 28,29,348 (49.58 %)
4. 2011 సామాజిక, ఆర్ధిక, కుల గణన గణాంకాల ప్రకారం తెలంగాణా రాష్ట్రంలో కుటుంబం లో ప్రధాన వ్యక్తి నెలసరి ఆదాయం 5000 రూపాయల లోపు ఉన్న కుటుంబాలు 43,02,997 (75.41%).
5. NSSO 70 వ రౌండ్ ప్రకారం తెలంగాణా రాష్ట్రం లో సంస్థాగత రుణాలు అంధక, వ్యవసాయం గిట్టుబాటు కాక రుణాల ఊబిలో కూరుకు పోయిన వ్యవసాయ కుటుంబాలు – 89.1 శాతం. ఈ కుటుంబాల సగటు అప్పు 93,500 రూపాయలు.
6. NSSO 70 వ రౌండ్ (2014) ప్రకారం తెలంగాణా రాష్ట్రం లో వ్యవసాయదారులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి తెచ్చుకున్న రుణ బకాయిలు – 60.3 శాతం

7. తెలంగాణ రాష్ట్రంలో నికర సాగు భూమి - 49,61,000 హెక్టార్లు. ఒక సారి కన్నా ఎక్కువ సార్లు విత్తే భూమి - 10,36,139. మొత్తం స్థూల విత్తే భూమి - 56,90,089 హెక్టార్లు.
8. తెలంగాణా రాష్ట్రం లో సగటు వర్షపాతం – 906.5 మిల్లీ మీటర్లు
9. తెలంగాణా రాష్ట్రం లో నికర సాగు నీటి ఆధారిత భూమి విస్తీర్ణం (ఖరీఫ్ ) -14,87,000 హెక్టార్లు (2014 -15 )

ఈ నేపధ్యం లో వ్యవసాయ రంగ కుటుంబాలను ఆర్ధికంగా బలోపేతం చేసేందుకు, ఆ రంగంలో స్వావలంబన పొందేందుకు ఖచ్చితంగా చేపట్టాల్సిన చర్యలలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు ఈ రంగానికి పెంచడమనేది మొదటిది .

**సమస్య 1:**

**వ్యవసాయ రంగానికి తగ్గుతున్న బడ్జెట్ కేటాయింపులు :**

1. రాష్ట్ర వ్యవసాయ రంగానికి నేరుగా బడ్జెట్ కేటాయింపులు అతి తక్కువగా ఉంటున్నాయి. ప్రణాళిక మరియు ప్రణాళికేతర కేటాయింపులు 2016-17 లో వ్యవసాయ మరియు సహకార శాఖకు, ప్రణాళిక మరియు ప్రణాళికేతర కేటాయింపులు కలిపి రూ. 6,759.71 కేటాయించారు. గత సంవత్సరం 2015-16 లో జరిపిన కేటాయింపులు రూ. 7,134.70 కోట్లు. 2014-15 లో జరిపిన కేటాయింపులు రూ. 6,276.33. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరంలో కేటాయింపులు 5% తక్కువ.
2. **ఈ బడ్జెట్ లో కూడా ప్రణాళిక కేటాయింపులు గత ఏడాది కంటే 241 కోట్లు తగ్గించారు** . కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు నేరుగా బదలాయించి, రాష్ట్రాలకు స్వేచ్చ కల్పించాము అంటుంటే, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం బాధ్యత నెత్తిన వేసుకోకపోవడం అన్యాయం .
3. **మార్కెటింగ్ మరియు ఉద్యాన శాఖలకు తప్పిస్తే, వ్యవసాయం మరియు అనుబంధ రంగాల లోని అన్ని శాఖలకు నిధులు తగ్గాయి..**
4. **కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపులు 2014-15 లో రూ. 815.57** కోట్లు కాగా, 2015-16 లో ఇది రూ. 674.74 కోట్లకు తగ్గింది. ఈ సంవత్సరం కేవలం కేటాయింపులు కేవలం రూ. 631.95 కోట్లు మాత్రమే.
5. **రుణ మాఫీ అమలుకు 4,250 కోట్లు, కేంద్ర పధకాలకోసం కేటాయించిన 631 కోట్ల నిధులను తీసివేస్తే, రాష్ట్ర ప్రభుత్వం తానుగా వ్యవసాయ శాఖకు కేటాయించిన నిధులు కేవలం 1729 కోట్లు మాత్రమే .**
6. **2014-15** లో మార్కెట్ స్థిరీకరణ నిధికి 400 కోట్లు కేటాయిస్తే, 2015-16 లో దానిని 75 కోట్లకు తగ్గించారు. ఈ ఏడాది అది పూర్తిగా ఎత్తి వేసారు. ఈ ఏడాది పత్తి, చెరకు పంటలు వేసిన రైతులు గిట్టుబాటు ధరలు రాక బాగా నష్ట పోయారు. వారి ధాన్యాన్ని కూడా ఈ సీజన్ లో ఎఫ్ సి ఐ సేకరించకపోతే, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సేకరణకు దిగకపోతే, వరి రైతులు తీవ్రం గా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే మార్కెట్ స్థిరీకరణ నిధి కోసం కనీసం 5000 కోట్లు కేటాయించి ఉండాల్సింది .
7. **కేంద్ర ప్రభుత్వం కూడా ఒక పద్ధతి ప్రకారం వ్యవసాయరంగానికి నిధుల కేటాయింపు తగ్గించారు** . సబ్సిడీలు కూడా మరింత తగ్గిస్తామని చెబుతున్నారు. దేశం లో ప్రధాన ఉత్పత్తి, జీవనోపాధి రంగమైన వ్యవసాయ రంగం లో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలని నిపుణులు చెబుతుంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులలో కోత పెడుతున్నాయి. ఒక్కొక్కసారి కేటాయింపులు బాగానే కనపడినా, నిధుల విడుదల, ఖర్చు ఆ స్థాయిలో కనపడడం లేదు .

**కొన్ని పరిష్కారాలు :**

1. రాష్ట్ర ప్రభుత్వం, మరియు కేంద్ర ప్రభుత్వం తమ సంవత్సర బడ్జెట్ లలో కనీసం 10 శాతం నిధులను నేరుగా వ్యవసాయ రంగానికి కేటాయించాలి ( నీటిపారుదల రంగానికి కేటాయించే నిధులు కాకుండా )
2. నిధులను వ్యవసాయ సీజన్ లో రైతులకు ఉపయోగ పడే విధంగా విడుదల చేయాలి (ఆర్థిక సంవత్సరం చివరిలో కాకుండా). నిధుల కేటాయింపు మెజారిటీ రైతులకు ఉపయోగ పడేలా ప్రాధాన్యతలను నిర్ణయించుకోవాలి .
3. వ్యవసాయ రంగం లో వచ్చిన మార్పుల దృష్ట్యా సబ్సిడీ పథకాలలో తగిన మార్పులు చేయాలి. సన్న, చిన్న కారు, మధ్యతరగతి రైతులకు ఎక్కువ ఉపయోగ పడేలా ఈ పథకాలు ఉండాలి. మన వాతావరణానికి అనువుగాని పాలీహౌస్ లాంటి వాటికి కాకుండా (గత 2 సంవత్సరాలలో 500 కోట్లు కేవలం 2000 ఎకరాలలో పాలీ హౌస్ ల నిర్మాణం కోసం కేటాయించారు), క్షేత్ర స్థాయిలో గోదాములు, శీతల గిడ్డంగులు, మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతుల వసతి గృహాలు లాంటి మౌలిక వసతుల అభివృద్ధి కోసమూ, బావుల, బోరు బావుల తవ్వకం భారాన్ని రైతులే భరించకుండా, ప్రభుత్వం భరించే విధంగానూ ఈ సబ్సిడీ పథకాలను పునర్ నిర్వచించాలి .
4. రైతులకు కొంత భారంగా మారిన వ్యవసాయ కూలీ చెల్లింపు మొత్తాన్ని కొంత సబ్సిడైజ్ చేసే విధంగానూ(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్ఫూర్తిని దెబ్బ తీయకుండా, అందులో కూలీల హక్కులకు ఎటువంటి భంగం కలిగించకుండా) కేటాయింపులు చేయవచ్చు.
5. మొత్తం వ్యవసాయ కుటుంబాల ఆదాయ భద్రత లక్ష్యంగా, ప్రతి సంవత్సరం స్థితి గతులను పరిశీలించి, నివేదిక రూపొందించి, అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక రైతుల ఆదాయ కమీషన్ ను నియమించాలి. ఈ కమీషన్ పూర్తి స్వయం ప్రతిపత్తితో పని చేసే విధంగా ఉండాలి. పంట ఉత్పత్తి ఖర్చులను, కుటుంబాల జీవన వ్యయాలను పరిగణలో ఉంచుకుని ఈ కమీషన్ సమగ్ర నివేదికలు రూపొందించాలి.
6. ఈ కమీషన్ ఆధ్వర్యం లో రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పంటల ఉత్పత్తి ఖర్చులను శాస్త్రీయం గా అంచనా వేసి, పంటలకు లాభసాటి ధరలను ప్రతిపాదించేందుకు రాష్ట్ర స్థాయి CACP ని నియమించాలి. అలాగే పశు పోషకుల ఖర్చులను, ఆదాయాలను కూడా ఈ కమీషన్ పరిశీలించాలి .
7. ఈ కమీషన్ నివేదికలకు, సిఫారసులకు చట్ట బద్ధత కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి .
8. మొత్తం వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు, వ్యవసాయ రంగ బ్యాంకు రుణాలు వాస్తవ సాగుదారులకు లేదా వ్యవసాయదారుల సహకార సంఘాలకు, రైతులు మాత్రమే భాగస్వాములుగా ఉండే ఉత్పత్తిదారుల కంపెనీలకు మాత్రమే అందేలా ప్రణాళికలు రూపొందించాలి .
9. వ్యవసాయ రంగం పై ఆధారపడిన యితర వ్యాపారులకు, కంపెనీలకు ఈ పెట్టుబడులను మళ్ళించ కూడదు . నగరాలను, పట్టణాలను వ్యవసాయ రంగ రుణాల పరిధి నుండి తప్పించాలి .
10. రాష్ట్రం లో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకునే సన్న ,చిన్న రైతులకు, భూమి లేని నిరుపేదలకు, బడుగు, బలహీన వర్గాలకు సాగు భూములు అందుబాటులో లేకపోవడం తో ఈ వర్గాల ప్రజలు అధిక కౌలు ధరలు చెల్లించి భూములను కౌలుకు చేస్తున్నారు. పైగా ఈ రైతులకు సంస్థాగతంగా ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయమూ అందడం లేదు. దీని వల్ల ఈ రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడి, ఎక్కువ వడ్డీ రేట్లకు రుణాలు తెచ్చుకుంటున్నారు .

11. కాబట్టి రాష్ట్రం లో భూమిలేని గ్రామీణ నిరుపేదలకు భూమి అందుబాటులో ఉంచేందుకు రాష్ట్రం లో జరుగుతున్న భూమి స్పెక్యులేటివ్ మార్కెట్ ను నియంత్రించాలి. వ్యవసాయేతర ఆదాయాలు ప్రధానంగా కలిగిన వారు వ్యవసాయ భూములు కొనకుండా నిషేధం విధిస్తూ చట్టం చేయాలి (1950 లలో తెలంగాణా రాష్ట్రం లో అమలులో ఉన్న చట్టం అలాంటిదే .) భూముల కౌలు ధరలపై నియంత్రణ విధించేలా పాత కౌలు చట్టాలను అమలు చేయాలి .
12. భూముల కేటాయింపు, సేకరణ విధానం కంటే ముందుగా భూమి వినియోగ విధానం తీసుకు రావాలి. పర్యావరణ హితమైన పద్ధతులతో భూమిని సరైన పద్ధతులలో ఎలా వినియోగించుకుంటాం ? ఏయే రంగాలకు భూమిని ఎలా, ఎంత కేటాయిస్తాం ? అనేది స్పష్టంగా నిర్ణయించాలి .

**సమస్య 2 :**

**పంటల పొందిక లో వస్తున్న మార్పులు :**

1. తెలంగాణా రాష్ట్రం లో వాతావరణ పరిస్థితులు, సాగుభూముల స్థితిగతుల రిత్యా అనేక పంటలు సాగయ్యేవి . ముఖ్యంగా జొన్న మరి కొన్ని చిరు ధాన్యాలు, కంది,పెసర, ఉలవలు తో సహా అన్ని రకాల పప్పు ధాన్యాలు, వేరు శనగ, ఆముదం, నువ్వులతో సహా అనేక నూనె గింజల పంటలు ఉండేవి. ఈ పంటల దిగుబడులు తక్కువగానే ఉన్నా, ఖర్చు కూడా తక్కువే అయ్యేది. ముఖ్యంగా స్థానిక విత్తన రకాలు , పశువుల ఎరువు, అందుబాటులో ఉండేవి కనుక రైతులు ఎక్కువ ఖర్చు లేకుండానే పంటలు సాగు చేసేవారు. ప్రధానంగా వర్షాధార పంటలు ఉండేవి కనుక –పూర్తి కరువు కాలం లో తప్ప – చాలా సందర్భాలలో ఎంతో కొంత పంట యింటికి వచ్చేది. వ్యవసాయం కోసం అప్పులు చేయవలసి వచ్చేది కాదు .
2. కానీ కొంత సాగునీటి వనరులు వచ్చాక, బోర్ వెల్స్ వచ్చాక వరి విస్తీర్ణం బాగా పెరిగింది. ధాన్యానికి ప్రభుత్వ సేకరణ సౌకర్యం ఉండడం, ఆహార అలవాట్లలో వచ్చిన మార్పులు కూడా యిందుకు కారణమయ్యాయి. పత్తి కొన్ని ప్రాంతాలకే, ముఖ్యంగా నల్లరేగడి భూములున్న ప్రాంతాలకే పరిమితమై ఉండేది. పత్తిలోనూ అనేక స్థానిక రకాలు ఉండేవి . ఈ పత్తి విత్తన రకాలు వర్షాధార ప్రాంతాలకు అనుకూలంగా ఉండేవి. పత్తి సాగుకు ఖర్చు తక్కువగా ఉండేది .
3. కానీ బీటీ పత్తి వచ్చాక పత్తి పంట వేగంగా విస్తరించింది. ఈ బీటీ పత్తి విత్తనాలలో ఒక జన్యువుపై Monsanto కంపెనీకి పేటెంట్ ఉండడం వల్ల, మొత్తం పత్తి విత్తన మార్కెట్ ఆ కంపెనీ , దాని అనుబంధ కంపెనీల చేతుల్లోకి పోయింది. ప్రతి సంవత్సరం రైతులు విత్తనాలను మార్కెట్ నుండే కొనుగోలు చేస్తున్నారు . పైగా ఈ బీటీ పత్తి పంట దిగుబడులపై కంపెనీల ప్రచారం రైతులను భ్రమలలోకి నెట్టింది . దీనితో రైతులు బీటీ పత్తికి అనువుగాని భూములలో కూడా దీనిని వేస్తున్నారు. అనేక పంటలు సాగు భూముల నుండి మాయమవుతున్నాయి. బీటీ పత్తి విస్తీర్ణం కొన్ని జిల్లాలలో 70 శాతానికి చేరింది . మొత్తం రాష్ట్రం లో 50 శాతానికి చేరింది.
4. మన వర్షాధార భూములకు అనువుగాని మొక్క జొన్న పంట కూడా వేగంగా వ్యాపించింది . సాధారణం గా ఈ భూములకు అనువైన మొక్కజొన్న రకాలు మాయమైపోయాయి . కరువు ,వర్షాభావ పరిస్థితులలో ప్రస్తుత మొక్కజొన్న హైబ్రీడ్స్ తట్టుకోలేక రైతులకు తీవ్ర నష్టాలను కలిగిస్తున్నాయి .
5. సోయాబీన్ కొన్ని భూములకు అనువైనదే అయినా, సోయా విత్తనంతో రైతులు సమస్యను ఎదుర్కుంటున్నారు. పైగా అకాల వర్షాలు సోయా విత్తనం మొక్కపైనే మొలకెత్తే పరిస్తితివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు .
6. హైదరాబాద్ నగరం ,యితర నగరాల చుట్టూ కూరగాయలు పండే అనేక ప్రాంతాలు రియల్ ఎస్టేట్ వల్ల ప్లాట్స్ గా మారిపోయాయి . గతంతో పోల్చినపుడు కూరగాయల, పండ్ల తోటల విస్తీర్ణం కొంత పెరిగినప్పటికీ సన్న ,చిన్నకారు రైతులకు

ఉపయోగపడేలా క్షేత్ర స్థాయిలో శీతల గిడ్డంగులు లేకపోవడం వల్ల రైతులు పండించిన పంటలో ప్రధాన భాగాన్ని నష్టపోతున్నారు . లేదా అతి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు .

7. మార్కెట్ లో కంది ,యితర పప్పు ధాన్యాలకు ధరలు మండిపోతున్నా ఆ ధరలు రైతులకు అందడం లేదు . ఇప్పుడున్న విత్తన రకాలు,దీర్ఘకాల రకాలు. దిగుబడులు తక్కువ . పురుగులు ,తెగుళ్ల సమస్య కూడా ఎక్కువ గానే ఉంటున్నది . దీని వల్ల రైతులు ఈ పంటలు మానేసి పత్తి వైపు మొగ్గారు. నూనె గింజలలో ఆముదం పరిస్థితి కూడా అంతే . ఈ పంట విస్తీర్ణం తగ్గించేసి రైతులు పత్తి వైపు మళ్ళారు .

8. పత్తి పంట మీద వున్న భ్రమలు, యితర పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, దిగుబడులు, ధరలు సరిగా లేకపోవడం, పత్తికి మాత్రమే కొంత మార్కెట్ సౌకర్యం, రుణ సౌకర్యం ఉండడం, కోతులు, అడవి పందులు యితర పంటలను బతకనీయకపోవడం తదితర కారణాల వల్ల కూడా ఈ పత్తి విస్తరించింది .

**కొన్ని పరిష్కారాలు :**

1. రాష్ట్రం లో ఆహార అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నెల సారం, రకం, నీటి పారుదల సౌకర్యాలకు అనుగుణం గా పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి . అందుకవసరమైన అన్ని ప్రభుత్వ మద్దతు వ్యవస్థలనూ కూడగట్టాలి . బలోపేతం చేయాలి . స్థానిక పరిస్థితులకు అనువైన విత్తన రకాలను ప్రోత్సహించాలి. అందుబాటులో ఉంచాలి .
2. యితర పంటలకు కూడా మద్దతు ధరలు, పంట రుణాలు, మార్కెట్ సౌకర్యాలు కల్పించాలి . అవసరమైతే ఆహార పంటలను (చిరు ధాన్యాలు , నూనె గింజలు , పప్పు ధాన్యాలు) ప్రభుత్వమే సేకరించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయాలి .
3. రాష్ట్రం లో నగర జనాభా అవసరాలకు అనుగుణంగా కూరగాయలు,పండ్లు లభించడం లేదు . యితర రాష్ట్రాలనుండి దిగుమతి చేసుకుంటున్న పరిస్థితి ఉంది . ఈ నేపధ్యం లో రాష్ట్రం లో అన్ని జిల్లాలలో కూరగాయల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలి. యిందుకు పాలీ హౌస్ లు ఎంత మాత్రం పరిష్కారం కాదు . అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేలా కొంత షేడ్ నెట్ సౌకర్యాన్ని సన్న చిన్నకారు రైతులకు అందుబాటులో ఉంచడం, క్షేత్ర స్థాయిలో శీతల గిడ్డంగులను నిర్మించడం, ప్రాసెసింగ్ యూనిట్లను రైతులకు అందుబాటులో ఉంచడం చేయాలి . వీటిని ప్రైవేట్ వ్యాపారులకు కాకుండా రైతుల సహకార సంఘాలకు యివ్వాలి .
4. రైతులు పంటల పొందికలో మార్పులు తెచ్చుకునేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ నిరంతరం విస్తృత ప్రచారం చేయాలి. మీడియా లో, పంటల దిగుబడులపై కంపెనీలు సాగించే బోగస్ ప్రచారాన్ని అడ్డుకోవాలి . ఈ ప్రాంతానికి అనువుగాని పంటలను, ఎగుమతుల లక్ష్యం తో, వాతావరణాన్ని నియంత్రించి, కృత్రిమ పద్ధతిలో పండించేందుకు ఎవరు ప్రయత్నించినా ఏ మాత్రం ప్రభుత్వ నిధులను ఖర్చు పెట్ట కూడదు. సబ్సిడీలు ఇవ్వకూడదు .

**సమస్య 3 :**

**పంట రుణాలు, పంటల బీమా :**

1. పంట రుణాలనేవి వాస్తవ సాగుదారులు పంటలను పండించేందుకు యివ్వాల్సినవి . కానీ ఈ పంట రుణాలు వాస్తవ సాగుదారులకు కాకుండా భూముల యజమానులకు మాత్రమే వెళుతున్నాయి . ఒక్క ఎకరం సాగు భూమి లేని హైదరాబాద్ నగరానికి కూడా ప్రతి సంవత్సరం 400 కోట్ల రూపాయల పంట రుణాలు వెలుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు . మొత్తం వ్యవసాయ రుణాలు కూడా హైదరాబాద్ నగరానికే 4000 కోట్లకు పైగా వెళుతున్నాయి (రాష్ట్రం లో అత్యధికం)
2. పత్తి విస్తీర్ణం పెరిగాక రాష్ట్రం లో కౌలు రైతుల సంఖ్య బాగా పెరుగుతున్నది . రాష్ట్రం లో కనీసం 10 లక్షల మంది కౌలు రైతులు ఉంటారని ఒక అంచనా . మహిళా రైతుల సంఖ్యా ఎక్కువ గానే ఉన్నా వారి పేర్లపై భూములు లేకపోవడం వల్ల వారికి కూడా

బ్యాంకులు పంట రుణాలు యివ్వడం లేదు . ప్రభుత్వ భూ పంపిణీ పథకాలలో భూములు పొందిన దళిత,  వెనుక బడిన వర్గాల, మైనారిటీ రైతులకు బ్యాంక్ రుణాలు అందడం లేదు . ఆదివాసీ రైతులకు యిస్తున్న పంట రుణాలు కూడా తక్కువే. దేవాదాయ భూములను కౌలుకు చేస్తున్న రైతులకు కూడా బ్యాంకులు రుణాలు యివ్వడం లేదు.

3. అధీకృత సాగుదారుల చట్టం 2011 వచ్చాక కూడా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు యిచ్చే ప్రక్రియ ముందుకు వెళ్ళడం లేదు. గుర్తింపు కార్డులు పొందిన రైతులకు కూడా బ్యాంకులు రుణాలు యివ్వడం లేదు. దీనివల్ల ఈ సాగుదారులు ప్రధానంగా ప్రైవేట్ అప్పులపై ఆధారపడుతున్నారు. వడ్డీ రేట్లూ ఎక్కువే . ఒకటి రెండు సంవత్సరాలలో ప్రైవేట్ రుణాలను తీర్చలేకపోతే అవి పేరుకు పోతున్నాయి. ఈ పరిస్థితి లోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.  లక్షల్లో కౌలు రైతులు వుంటే..కొన్ని వేలమందికి కూడా రుణ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. రుణ గుర్తింపు కార్డులు ఇచ్చిన వాళ్ళల్లో కూడా అందరికి ఋణం అందుతున్న పరిస్థితి లేదు. ఉదాహరణ కి ఆదిలాబాద్ జిల్లా లో సుమారుగా  3-4 లక్షల మంది కౌలు రైతులు (వ్యవసాయం మీద ఆధార పడిన వారు దాదాపు 18 లక్షలు) ఉంటారని అంచనా.  గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లా లో గత సంవత్సరం కేవలం 3753 గుర్తింపు కార్డులు ఇవ్వగా అందులో ఋణం అందినది మాత్రం 282 మందికే.  మొత్తం కౌలు రైతులకి అందిన ఋణం రూ. 10.6 కోట్లు.



**PROFORMA - K6**

**Report for the month of December, 2015**

**Statement showing the progress of issue of Loan Eligibility Cards (LECs) under A.P. Land Licensed Cultivators Act, 2011 (for the year 2015-16)**

| Sl. No. | Name of the Division | Total No. of LECs issued | Total No. of LEC holders to whom loans sanctinoed | Total amount of loan sanctioned (Rupees in Lakhs) |
|---|---|---|---|---|
| a | 1 | 2 | 3 | 4 |
| 1 | Adilabad | 1658 | 28 | 8.10 |
| 2 | Asifabad | 562 | 74 | 19.95 |
| 3 | Mancherial | 1021 | 175 | 77.52 |
| 4 | Nirmal | 433 | 5 | 1.10 |
| 5 | Utnoor | 79 | 0 | 0.00 |
| ADILABAD DISTRICT GRAND TOTAL | | 3753 | 282 | 106.67 |

Sd/- D.Sanjeeva Reddy
for Collector, Adilabad

4. బ్యాంకుల నుండి పంట రుణాలు పొందిన రైతుల ఋణం నుండే బ్యాంకులు  పంటల బీమా ప్రీమియం కోత పెట్టుకుంటున్నాయి కనుక వారు మాత్రమే బీమా పరిధిలోకి వస్తున్నారు . పైగా గ్రామం యూనిట్ గా పంటల బీమా అన్ని పంటలకూ లేకపోవడం వల్ల రైతులకు పెద్దగా ఉపయోగపడడం లేదు . కొత్త కొత్త బీమా పథకాలు ప్రవేశ పెడుతున్నా, అవి యింకా పైలట్ దశ దాటడం లేదు . ఇప్పటికి పంటల భీమా పరిది లోకి వచ్చే రైతులు 30% కన్నా తక్కువే. 2014 పంటల భీమ లో కొన్ని మార్పులు చేయటానికి ప్రభుత్వం సంకల్పించి చివరికి 2015-16 నుంచి అమలు లోకి తెచ్చింది. ఈ మార్పులు రైతులకు ఉపయోగ పడక పోగా సమస్యను ఇంకా జటిలం చేసేలా వున్నాయి.

    a. **ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన** కింద పంటల భీమ పథకం లో కి ప్రైవేటు కంపెనీ లకు ప్రవేశం కల్పించారు. తెలంగాణా లో అగ్రికల్చరల్ ఇన్సురన్సు కంపెనీ, బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సురన్సు కంపెనీ, ఈ ఇన్సురన్సు అందించటానికి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.
    b. రైతులు కొంత మొత్తం చెల్లిస్తే (మొత్తం లోను లో ఆహార పంటలకు 2%, వాణిజ్య పంటలకు 5%) చెల్లిస్తే మిగిలినది రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు భరిస్తాయి. జిల్లాల మధ్య లో ప్రీమియం విషయం లో వున్నా తేడాల వలన కొన్ని జిల్లాల లో ఇది 20% వరకు ఉండొచ్చు. ప్రీమియం కట్టటానికి జూలై 30 ఆఖరు తేది.
    c. లోను తీసుకున్న రైతులే కాక ఇతర రైతులు, కౌలు రైతులు భీమా కట్టాలి అంటే భూమి పట్టా కాని, ప్రభుత్వం ఆమోదించిన ఏదేని దృవీకరణ పత్రం కాని వుండాలి. ఈ రోజు వరకు ఒక్క రైతుకు కూడా గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదు.
    d. వాతావరణ భీమ కింద ఈ సారి పత్తి (తొమ్మిది జిల్లాలు), మిరప (ఖమ్మం, వరంగల్), ఆయిల్ పాం (ఖమ్మం) మరియు బత్తాయి (నల్గొండ) పంటలు ఎంచుకోబడ్డాయి. అయితే ప్రీమియం కట్టటానికి ఆఖరు తేది పత్తి పంటకు జూన్ 14, మిరపకు జూలై 9, ఆయిల్ పాం కు జూలై 14, బత్తాయి కి ఆగష్టు 9. అయితే ఇప్పటిదాకా మంచిగా వర్షాలు రాలేదు, పత్తి, మిరప లాంటి వార్షిక పంటలు ఇప్పటిదాకా ఇంకా నాట్లు పడలేదు, రుణాలు అందలేదు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. దీనితో చాలా తక్కువ మంది రైతులు మాత్రమే ఈ అవకాసం పొందే పరిస్థితి వుంది. జూలై ఆఖరు వరకు ఈ గడువు పెంచాల్సిన అవసరం వుంది.

5. వాతావరణం లో వస్తున్న మార్పుల కారణం గా అకాల వర్షాలు, వర్షాభావం , కరువులు,వడగండ్లు, భారీ వర్షాలు లాంటి ప్రకృతి వైపరీత్యాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు . కరువును ప్రకృతి వైపరీత్యంగా చూడక పోవడం వల్ల, తెలంగాణా రైతులకు ఏ  మాత్రమూ సహాయం అందడం లేదు . పంటకు అవసరమైన సమయాలలో వర్షాల మధ్య విపరీతమైన గాప్ ఉండడం , మొత్తంగా సీజన్ లో సాధారణ వర్షపాతం నమోదవడం లాంటి కారణాల వల్ల ,పంటలు కరువు, వర్షాభావం బారిన పడి నష్టపోయినా రైతులకు సహాయం అందడం లేదు . పైగా వాతావరణాన్ని సూచించే కేంద్రాలు  మండలానికి ఒకటి మాత్రమే ఉన్నాయి. దీని వల్ల ప్రతి 5 గ్రామాల మధ్యలో కూడా  వర్షపాతం వ్యత్యాసం ఉంటున్న దశలో రైతులకు సరైన సహాయం అందడం లేదు .

**పరిష్కారాలు :**

1. వాస్తవ సాగుదారులకు మాత్రమే పంట రుణాలు యివ్వాలి .
2. ప్రతి పంటకూ నిర్ణయించిన పంట రుణ పరిమితి (స్కేల్ అఫ్ ఫైనాన్స్) ప్రకారం అన్ని పంటలకూ పంట రుణాలివ్వాలి. స్కేల్ అఫ్ ఫైనాన్స్ కు చట్టబద్ధత  కల్పించాలి .

3. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు యివ్వాలి . కార్డులు పొందిన రైతులందరికీ బ్యాక్ రుణాలు ఖచ్చితంగా యిచ్చేలా 2011 చట్టం లో సవరణలు చేయాలి .
4. రాష్ట్రం లో ఎంత విస్తీర్ణం లో ఏ పంటలు వేస్తున్నారో ప్రభుత్వం దగ్గర సమాచారం ఉంటుంది కనుక ప్రభుత్వం ముందుగానే బ్యాంకుల రుణాలతో సంబంధం లేకుండా పంటల బీమా ప్రీమియంను బీమా కంపెనీకి చెల్లించాలి. సన్న,చిన్న,మధ్యతరగతి రైతులకు పూర్తిగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. మిగిలిన రైతులకు 50 శాతం ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలి .
5. ప్రతి 5 గ్రామాల మధ్యలో ఒక వాతావరణ సూచీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి .ఎప్పటికప్పుడు వాతావరణం లో మార్పులను, వర్షపాతాన్ని నమోదు చేయాలి .
6. కరువు మాన్యువల్ లో మార్పులు చేయాలి . కరువు మండలాలను నిర్ధారించే ప్రక్రియను పునర్ నిర్వచించాలి .
7. గ్రామం యూనిట్ గా బీమా పధకాలను అన్ని పంటలకూ విస్తరించాలి .
8. ప్రకృతి వైపరీత్యాల కారణం గా పంటలను నష్ట పోయిన రైతులకు ఎకరానికి 10,000 రూపాయల నష్ట పరిహారం చెల్లించాలి

**సమస్య 4 - విత్తన సమస్య :**

1. కంపెనీలు యిష్టారాజ్యం గా వ్యవహరిస్తూ విత్తనం విషయం లో రైతుల జీవితాలతో ఆడుకుంటున్నాయి . .ఎటువంటి వ్రాతపూర్వక ఒప్పందాలు లేకుండా రైతులకు parantal లైన్స్ యిచ్చి రైతులతో హైబ్రిడ్ విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నాయి. విత్తన రైతులు నష్టపోతే ఏ విధమైన పరిహారం చెల్లించకుండా తప్పించుకుంటున్నాయి . బీటీ పత్తి విత్తన రైతులతో మహబూబ్ నగర్ జిల్లాలో విత్తన కంపెనీలు వ్యవహరిస్తున్న తీరు వారి దోపిడీకి పరాకాష్ట .
2. తాము ఉత్పత్తి చేసిన నాసి రకం విత్తనాలను రైతులకు అంట గడుతున్నాయి. రైతులు నష్ట పోయిన సందర్భాలలో కంపెనీలు మొహం చాటేస్తున్నాయి. విత్తన ధరలను అమాంతం పెంచేస్తున్నాయి.
3. వాస్తవానికి వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయాలు విత్తన పరిశోధనలు నిరంతరం సాగిస్తూ మన ప్రాంత రైతుల అవసరాలకు తగిన విత్తనాలను అందించాలి. బ్రీడర్ సీడ్ ఉత్పత్తి చేసి రైతుల సహకార సంఘాలకు యిచ్చి విత్తనోత్పత్తి చేయించవచ్చు. కానీ ఈ సంస్థలు ఆ పని చేయడం లేదు. పైగా ఎప్పుడైనా కొన్ని బ్రీడర్ సీడ్స్ ఉత్పత్తి చేస్తే వాటిని కంపెనీలకు అమ్ముకుంటున్నాయి.

**పరిష్కారాలు :**

1. రాష్ట్రాన్ని సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా గా మారుస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ఆహ్వానించ దగినవే. కానీ ఈ సీడ్ బౌల్ విత్తన రైతుల సమస్యలను పరిష్కరించేదిగా ,విత్తన రైతులకు లాభం చేసేదిగా ఉండాలి. రైతులకు అన్ని రకాల పంటలకు నాణ్యమైన విత్తనాలు తక్కువ ధరలో లభించాలి . విత్తనాల నాణ్యతలో లోపం వల్ల పంట నష్టం జరిగితే వెంటనే తగిన నష్టపరిహారం అందేలా ఉండాలి . కంపెనీల ప్రయోజనా కంటే విత్తన రైతుల,యితర రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత దక్కాలి.
2. రాష్ట్ర స్థాయిలో విత్తన చట్టాన్ని తేవాలి . విత్తన గ్రామాలను ,విత్తన రైతుల సహకార సంఘాలను బలోపేతం చేయాలి . బ్రీడర్,ఫౌండేషన్ విత్తనాలను ఖచ్చితంగా రైతుల సహకార సంఘాలకు యివ్వాలి. విత్తనోత్పత్తి చేయించాలి. రైతులకు సబ్సిడీ పై నేరుగా అందించాలి .

**సమస్య 5 :  పంటలకు గిట్టుబాటు కాని ధరలు :**

1. రైతులు తీవ్రంగా నష్టపోతున్నది  తాము  పండించిన పంటలకు న్యాయమైన లాభసాటి ధరలు రాకపోవడం వల్లనే . పంటల ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి . ఎరువులు ,పురుగు ,కలుపు విషాలు ,విత్తనాల ధరలు ,ట్రాక్టర్లు,యితర యంత్రాల కిరాయిలు ,టర్మ్ లోన్స్ పై వడ్డీలు , బోర్ బావులపై పెట్టుబడులు ,కరెంట్ లో వోల్టేజీ తో వచ్చే సమస్యలు , మోటార్లు కాలిపోవడం ,ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోవడం,రిపేర్లు ,సాపేక్షికంగా కూలీ రెట్లు పెరగడం,ప్రైవేట్ అప్పులపై వడ్డీల తో రైతు పై అనేక భారాలు పడుతున్నాయి .
2. కానీ వీటన్నిటినీ సరిగా లెక్కించి ,పండిన పంట అమ్మితే ఖర్చులు పోను రైతుకు లాభం ఉండేలా ధరలు రావాల్సి ఉంది . ప్రపంచం లో మార్కెట్ కోసం జరిగే యితర  ఏ ఉత్పత్తి కార్యక్రమం లోనైనా  యిదే సూత్రం అమలవుతుంది . కానీ రైతులు పండించే పంటల విషయం వచ్చే సరికి యిది రివర్స్ అవుతుంది . రైతు ఎదురు సబ్సిడీ యిచ్చి దేశానికి తిండి పెట్టాలి .
3. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ,సి ఏ సి పీ కానీ ధరల నిర్ణయం విషయం లో అనుసరించే విధానాలు రైతుకు ఉరి పెట్టేవే . ఈ విధానాలతో రైతు నష్ట పోవడమే తప్ప ఒక్క సారి కూడా లాభం పొందలేదు . మార్కెట్ యార్డుల్లో దోపిడీ దీనికి అదనం .
4. రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు  ధరల విషయం లో రైతులతో దోభూచులాడుతుంటాయి . ఒకరిపై మరొకరు నెపం నెట్టేసుకుంటూ రైతులను ముంచుతుంటారు. అంతిమం గా పరిశ్రమలకు చవక ధరలకు వ్యవసాయ  ఉత్పత్తులను అందించడం వీరి లక్ష్యం.
5. వినియోగదారులపై భారం పడకూడదనీ ,ఆహార ద్రవ్యోల్బణం పెరగ కూడదనీ, WTO నిబంధనలను పాటించాలనీ కబుర్లు చెబుతూ రైతుల నడ్డి మాత్రం విరుస్తుంటారు . రైతులు వినియోగదారులుగా కూడా కంపెనీల చేతుల్లో నష్టపోతున్నారని తెలిసినా, అక్కడ మాత్రం మౌనంగా ఉంటారు. పంటలు కోతకు వచ్చినప్పుడే, రైతులు మార్కెట్ కు తెచ్చినప్పుడే ధరలు అకస్మాతుగా పడిపోతుంటాయి . ప్రభుత్వాలు చోద్యం చూస్తుంటాయి .
6. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులకు గుర్రైతే పరుగులెత్తే ప్రధాన మంత్రి ,ఆర్థిక మంత్రి  రైతుల పంటల ధరలు పడిపోయినా పట్టించుకోరు . మార్కెట్ లో జోక్యం చేసుకుని ధరలను నిలబెట్టరు. మార్కెట్లో ఆహార ఉత్పత్తుల ధరలు పెరిగితే మాత్రం ఆఘ మేఘాల మీద దిగుమతులకు పూనుకుంటారు . ధరల నియంత్రణకు పూనుకుంటారు . యితర దేశాల వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ ధరలకే ప్రపంచ మార్కెట్ కు వస్తున్నాయని కారణాలు చెప్పి ,యిక్కడ కనీస మద్దతు ధరలను పెంచరు. అదే సందర్భం లో అక్కడి ప్రభుత్వాలు అక్కడి రైతులకు/కంపెనీలకు వ్యవసాయం చేయడానికి ,ఎగుమతి చేయడానికి పెద్ద ఎత్తున సబ్సిడీలు యిస్తున్నాయని మాత్రం యిక్కడ  చెప్పరు.
7. **2016-17 ఖరీఫ్ పంట కాలానికి కేంద్రం ప్రకటించిన మద్దత్తు ధరలు**

| **పంట** | **రకము** | **ఖరీఫ్ 2015-16 మద్దత్తు ధర (రూ/క్వి)** | **ఖరీఫ్ 2016-17 మద్దత్తు ధర (రూ/క్వి)** | **పెరుగుదల (రూ/క్వి)** | **పెరుగుదల (%)** | **బోనస్ (రూ/క్వి)** |
|---|---|---|---|---|---|---|
| వరి | సాధారణ | 1410 | 1470 | 60 | 4.3 | --- |
| | గ్రేడ్ A | 1450 | 1510 | 60 | 4.1 | --- |
| జొన్న | హైబ్రిడ్ | 1570 | 1625 | 55 | 3.5 | --- |
| | మాల్దండి | 1590 | 1650 | 60 | 3.8 | --- |
| సజ్జ | --- | 1275 | 1330 | 55 | 4.3 | --- |
| మొక్క జొన్న | --- | 1325 | 1365 | 40 | 3.0 | --- |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రాగి | --- | 1650 | 1725 | 75 | 4.5 | --- |
| కంది | --- | 4625 (బోనస్ తో కలిపి) | 5050 (బోనస్ తో కలిపి) | 425 | 9.2 | 425 |
| పెసర | --- | 4850 (బోనస్ తో కలిపి) | 5225 (బోనస్ తో కలిపి) | 375 | 7.7 | 425 |
| మినుము | --- | 4625 (బోనస్ తో కలిపి) | 5000 (బోనస్ తో కలిపి) | 375 | 8.1 | 425 |
| వేరు శనగ | --- | 4030 | 4220 (బోనస్ తో కలిపి) | 190 | 4.7 | 100 |
| సోయాబీన్ | పసుపు రకం | 2600 | 2775 (బోనస్ తో కలిపి) | 175 | 6.7 | 100 |
| పొద్దు తిరుగుడు | --- | 3800 | 3950 (బోనస్ తో కలిపి) | 150 | 3.9 | 100 |
| గడ్డి నువ్వులు | --- | 3650 | 3825 (బోనస్ తో కలిపి) | 175 | 4.8 | 100 |
| నువ్వులు | --- | 4700 | 5000 (బోనస్ తో కలిపి) | 300 | 6.4 | 200 |
| పత్తి | మధ్య రకం పింజ | 3800 | 3860 | 60 | 1.6 | --- |
| | పొడుగు పింజా రకం | 4100 | 4160 | 60 | 1.5 | --- |

**పరిష్కారాలు :**

1. రాష్ట్ర స్థాయిలో పంటల ఉత్పత్తి ఖర్చులను లెక్కవేసి ,యిక్కడ రైతులకు యిచ్చే లాభసాటి ధరలను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలి . ప్రభుత్వం ప్రకటించిన ధరలకు చట్ట బద్ధత కల్పించాలి .
2. పంటల ఉత్పత్తి ఖర్చులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి . కౌలు ధరల నియంత్రణ ,భూసారం పెంపు ,మార్కెట్ యార్డుల నిర్మాణం , గోదాముల నిర్మాణం ,కూలీ రెట్ల భారం లో సబ్సిడీ,అవసరమైన పంటలను నేరుగా రైతులనుండి సేకరణ తదితర విషయాలలో ప్రభుత్వం పెట్టుబడులు పెంచాలి .
3. తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు, మెట్ట ప్రాంతాలలో 10 ఎకరాల వరకూ ఉచిత విద్యుత్ , వడ్డీలేని పంట రుణాలు, పంటల భీమా , ప్రకృతి వైపరీత్యాల పరిహారం కోసం కూడా ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి .
4. మార్కెట్ యార్డులకు చట్ట బద్ధత కల్పించడం, ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల నిర్వహణ లో ఏర్పాటు చేయడం ,రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలూ ఒకే చోట లభించేలా రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం , చిన్న సన్న కారు రైతులకు ఉపయోగపడే ,చిన్న కమతాలకు ఉపయోగపడే ,మెట్ట ప్రాంత రైతులకు ఉపయోగపడే యంత్రాలతో,మహిళా వ్యవసాయ కూలీల శ్రమను తగ్గించే పని ముట్లు , యంత్రాలతో - కస్టం హైరింగ్ సెంటర్స్ ను ఏర్పరచడం కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయాలి .

5. మహిళా రైతులకు ,దళిత ,ఆదివాసీ రైతులకు, ప్రోత్సాహం,సహకారం యిచ్చే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలి .పంటల సేకరణ లో వీరికి ప్రాధాన్యత యివ్వాలి .

**సమస్య 7: అసంఘటిత రంగం గా వ్యవసాయం**

1. కోట్లాది ప్రజలు తమ జీవనోపాదులకోసం వ్యవసాయం పైన ఆధార పడినా, అసంఘటితంగా వుండడం తో అటు ప్రభుత్వం తో కాని, ఇటు మార్కెట్ తో కాని జరిగే లావాదేవీల్లో నష్టపోతునే వున్నారు.
2. ప్రతి ఒక్క రైతు అమ్మకాలు, కొనుగోళ్ళు విడివిడిగా చేయటం వలన ఆర్థిక నష్టం తో పాటు, కష్టం కూడా పెరుగుతోంది.
3. స్వాతంత్ర పోరాటం కాలం నుంచే సహకార సంఘాల ఏర్పాటు జరిగినా 1964 సహకార చట్టం తర్వాత సహకార సంఘాల నిర్వహణ లో ప్రభుత్వ అధికారుల, రాజకీయ నాయకుల జోక్యం పెరిగి అవినీతి మాయం అయిపోయాయి. 1995 పరస్పర సహకార సంఘాల చట్టం ద్వార ఈ పరిస్థితిలో కొంచెం మార్పు వచ్చింది. అయితే ప్రభుత్వ సహాయం పెద్దగా లేక పోవటం తో సహకార సంఘాలు భాలోపేతం అవలేదు. ఎక్కడో ఒక చోట మంచి స్తానిక నాయకత్వం వున్నచోట ములకనూరు, ఎత్తొండ సహకార సంఘాలు లాంటివి నిలబదివున్నాయి.
4. తెలంగాణా ప్రభుత్వం G.O.28 ద్వారా సహకార చట్టం లోని 'స్వయం ప్రతిపత్తి' స్పూర్తి ని తూట్లు పొడుస్తూ నిర్ణయం తీసుకుంది. దీని ద్వార మరల సహకార సంఘాలు అన్ని కూడా ప్రభుత్వ అధికారుల అజమాయిషీ లో నడిచే సంస్థలుగా మారి పోతాయి.
5. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు 'ఉత్పత్తి దారుల కంపెనీ' లను ప్రోత్సహిస్తున్నాయి. అయితే సరైన సహకారం, నియమ నిభందనలు లేకపోవటం తో అవి కూడా భాలోపేతం అయ్యే పరిస్తితులు కనపడటం లేదు.
6. రుణాలు అందటం సహకార సంఘాలకు, ఉత్పత్తి దారుల కంపెనీ లకు ఇంకా కష్టం గానే వుంది. వ్యవసాయేతర ఆస్తులు collateral security గా అడగటం తో రుణాలు అందటం కష్టం గా వున్నది.

పరిష్కారాలు

1. సహకార సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలి. అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.
2. సహకార సంఘాలకు/ఉత్పత్తి దారుల కంపెనీ లకు రుణాలు అందటం కోసం క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ప్రారంబించాలి
3. సహకార సంఘాలకు పది సంవత్సరాల పన్ను రాయితీ ప్రకటించాలి.
4. సహకార సంఘాల స్వయంప్రతిపత్తి స్పూర్తి ని దెబ్బ తీసే జీ.వో. నో. 23 ను తక్షణం వెనక్కి తీసుకోవాలి.

**సమస్య 6: రైతుల ఆర్థిక ,జీవన ప్రమాణాలను దిగజార్చే మరి కొన్ని అంశాలు**

1. రాజ్యాంగం లో ప్రాధమిక హక్కులుగా చెప్పిన అంశాలనుండి ,ఆదేశిక సూత్రాలనుండి ప్రభుత్వం వైదొలగడం కూడా వ్యవసాయ కుటుంబాలను సంక్షోభం లోకి నెడుతున్నది . ముఖ్యంగా పౌష్టిక ఆహారం ,పరి శుభ్రమైన తాగునీరు , నివాసయోగ్యమైన వసతి ప్రజలందరికీ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత . కానీ ఈ బాధ్యత నుండి ప్రభుత్వాలు వైదొలిగి పోయాయి . రూపాయికి కిలో బియ్యం యివ్వడం తప్ప ( అది పౌష్టిక ఆహారం క్రిందికి ఏ మాత్రమూ రాదు ) మిగిలిన అంశాలన్నిటినీ ప్రభుత్వం వదిలేసింది .
2. పిల్లలకు విద్య ,అందరికీ ఆరోగ్యం అందించడం కూడా ప్రభుత్వం బాధ్యత . కానీ ఈ బాధ్యత నుండీ కూడా ప్రభుత్వం వైదొలగడం వల్ల ప్రైవేట్ పై వీటి కోసం రైతు కుటుంబాలు ఆధారపడడం పెరిగిపోయింది , యిది కూడా రైతు కుటుంబాల పై పెను భారాన్ని మోపుతున్నది . పంటల పొందిక లో వచ్చిన మార్పులు కూడా(పత్తి పెరగడం ) ప్రజలకు పౌష్టిక ఆహారం అందకుండా చేసింది

. పశు పోషణ తగ్గిపోవడం కూడా దీనికి ఆజ్యం పోసింది .వ్యవసాయకుటుంబాల  కొనుగోలు శక్తి తగ్గిపోవడం కూడా గ్రామీణ మహిళల , పిల్లల  ఆరోగ్యం లో పెను మార్పులకు కారణమవుతున్నది .

3. గ్రామీణ ప్రాంతాలలో ఒక మహమ్మారిగా మారిన మద్యం అలవాటు (కల్తీ కల్లు,గుడుంబా ,లిక్కర్ ) వ్యవసాయదారుల కుటుంబాలను నాశనం చేస్తున్నది . ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయం కోసం దీనిని ప్రోత్సహిస్తున్నది . దీని వల్ల నష్టాలు కళ్ళకు కనపడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందంటే, ప్రజలు తాగి మత్తులో ఉంటే తన విధానాలను ప్రశ్నించరనే దురుద్దేశ్యం కూడా కనపడుతుంది .
4. వినియోగదారీ సంస్కృతి గ్రామీణ ప్రజల ఆదాయాలను హరిస్తున్నది . పైగా మనుషుల మధ్య సజీవ సంబంధాలను తెన్చేస్తున్నది. మనుషులు ఒకరి కష్ట సుఖాలను ఒకరు పట్టించుకునే ,విషయాలను చర్చించుకునే సాంప్రదాయం కూడా కనుమరుగవుతున్నది .వ్యవసాయం గురించి రైతుల దగ్గర కూర్చుని  చర్చించే వారే గ్రామాలలో  కరువయ్యారు .
5. గ్రామ పంచాయితీలు ,సహకార సంఘాలు ,విద్యా కమిటీలు,  నీటి వినియోగదారీ సంఘాలు- మొత్తంగా ఎన్నికల రాజకీయాల రొంపిలో కూరుకుపోయి –వాటి నిజమైన కార్యాచరణను మరిచిపోయాయి . ప్రభుత్వాలు కూడా వాటికి నిధులు అందించకుండా, వాటిని స్వయం ప్రతిపత్తితో  నిలబడనీయకుండా,తమ చెప్పు చేతుల్లో ఉంచుకునే దురుద్దేశ్యం తో వాటి పని తీరును నీరు కార్చేశాయి .
6. మొత్తంగా వ్యవసాయేతర సమాజం కూడా గ్రామీణ వ్యవసాయ సమాజం నుండీ దూరం జరిగి పోయింది . ఆహారాన్ని దుకాణాలలో కొనుక్కోవచ్చనే వినియోగదారీ ధోరణి, గ్రామాల గురించీ, పంటల గురించీ, రైతుల గురించీ ఆలోచించకుండా పరాయీకరించింది . గ్రామానికి వెళ్ళే ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు కూడా కేవలం  తమ వృత్తి ప్రాంగణాలకే పరిమితమై పోతున్నారు తప్ప గ్రామం లోని ప్రజలతో సజీవ సంబంధాన్ని కోల్పోయారు . ఎంతగా వారు దూరం అయ్యారంటే ఆ గ్రామం లో రైతు ఆత్మహత్య జరిగినా స్పందించనంత.

**ఈ పరిస్థితులే వ్యవసాయదారులను ఆత్మహత్యలకు పూరి కొల్పుతున్నాయి. మాకెవరూ లేరనే భావనకు గురి చేస్తున్నాయి. ఈ పరిస్థితులను మార్చకుండా, రైతులకు భరోసా యివ్వకుండా ఆత్మహత్యలు ఆగవు. యిందులో ప్రభుత్వాలు,  అధికార యంత్రాంగం బాధ్యత ప్రధానం. సమాజం కూడా తన బాధ్యతను నెరవేర్చాలి.**